క్లుప్తంగా

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

చిన్నచింతకుంట: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూప్‌లలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ అంభాజి బుధవారం తెలిపారు. పదోతరగతి పూర్తయిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 30 వరకు అవకాశం ఉందన్నారు.

గోపుర నిర్మాణానికి శంకుస్థాపన



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని అయ్యప్ప క్షేత్రంలో వెలిసిన షిరిడి సాయిబాబా ఆలయం గోపుర నిర్మాణానికి బుధవారం సంకల్పసిద్ధి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. గోపుర నిర్మాణానికి దాతలు సాయం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు తిరుపతయ్యగౌడ్, మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, విశ్వేశ్వర్, కొండయ్య, కొంగరి శ్రీను, రాజు, వెంకటాంపల్లి రాజు, పల్లె జగన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో చదివి వివిధ యూనివర్సిటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం సన్మానించారు. ఈమేరకు ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య చదవాలంటే కచ్చితంగా యూనివర్సిటీ స్థాయిలో సీటు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, రవీందర్‌నాథ్, నిరంజన్‌గౌడ్, రాఘవేందర్, మాధవి, లత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



జడ్చర్ల టౌన్: బిజినేపల్లిలో నీటిగుంతలో పడి మృతిచెందిన చిన్నారులు ఫుర్కన్, మహమ్మద్‌ల కుటుంబ సభ్యులను బుధవారం మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌లు పరామర్శించారు. చిన్నారుల మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. మాజీ చైర్మన్ వాల్యానాయక్, నాయకులు తదితరులు ఉన్నారు.

నివాళి అర్పించిన నాయకులు

అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహేష్ ముదిరాజ్ అనారోగ్యంతో బాధపడుతూ చనిపోవడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే జీఎంఆర్ సోదరుడు భాస్కర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరిలు మహేష్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అదేవిధంగా అడ్డాకులలో చనిపోయిన బషీర్‌ఘోరీ కుటుంబాన్ని కూడా కాంగ్రెస్ నాయకులు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. విజయ మోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, తిరుపతయ్య, నర్సిములు, సయ్యద్‌షఫి తదితరులు ఉన్నారు.

అసంపూర్తిగా పనులు

- తాగునీటికి తిప్పలు
- సిద్ధాయిపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



కుళాయి వద్దనీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

భూత్పూర్: మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధాయిపల్లి వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద తీవ్ర మంచినీటి ఎద్దడి ఏర్పడింది. స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 288 డబుల్ బెడ్‌రూంల అర్హులకు కేటాయించారు. కాగా వంద కుటుంబాలకు పైగా ఇక్కడ ప్రస్తుతం నివాసం ఉంటున్నారు. అయితే పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడం, అసంపూర్తిగా పనులు చేయడం వంటివి ఇక్కడ నివాసం ఉంటున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా తాగునీటి కోసం అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే ఇళ్లలోకి వచ్చిన వారే స్వయంగా కాంట్రాక్టర్ వదిలేసిన అసంపూర్తి పనులను పూర్తి చేయించుకోవాల్సి రావడం శోచనీయం.

పరిస్థితి ఇలా..

- విద్యుత్తు వైర్లు నాసిరకంగా వేయడంతో పాటు, చాలావరకు ఇళ్లలో విద్యుత్‌కు సంబంధించి స్విచ్ బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు.
- బాత్‌రూం నిర్మాణం పనులు, కుళాయిలు బిగించలేదు. దీంతో స్వయంగా లబ్ధిదారులే స్వంత ఖర్చులతో ఏర్పాటు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది.
- ఇళ్లపై ప్లాస్టిక్ ట్యాంకులు నాసిరకంగా ఏర్పాటు చేయడంతో నీరు లీకై ఇబ్బందులు తప్పడం లేదు.
- చాలావరకు ఇళ్లలో నామమాత్రంగా ఫ్లోరింగ్ పనులు చేశారు. అదేవిధంగా వంటగదుల పనులు సైతం అసంపూర్తిగా వదిలేశారు.
- వీధుల్లో స్తంభాలకు లైట్లు బిగించినా కొన్ని రోజులే వెలుగులు చిమ్మడంతో ప్రస్తుతం అంధకారంగా మారింది.
- వీటిని కంటే ముఖ్యంగా తాగునీటి సమస్య ఇక్కడ ఉంటున్న వారిని వేధిస్తోంది. రెండు బోర్లు ఏర్పాటు చేయగా వేసవి దృష్ట్యా వట్టిపోవడంతో నీటి ఎద్దటి ఏర్పడింది. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును నిర్మాణం చేపట్టినా ఉపయోగంలో లేకుండా పోయింది. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే నీరు కొద్ది సమయం మాత్రమే వస్తుండడంతో అందరికీ అందడం లేదు.
- ఇటీవల ఎమ్మెల్యే జి. మధుసుదన్‌రెడ్డి రూ.5 లక్షలు చెక్కును మున్సిపల్ ఏఈకి నీటి సమస్య తీర్చాలనే అందజేశారు. కాగా మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మోటర్ బిగించి నీరు సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో సమస్య తీరలేదు. దీంతో అంతంత మాత్రమే వస్తున్న నీటి కోసం ప్రజల మధ్య నిత్యం తగాదాలు వస్తున్నాయి. పైగా మధ్యాహ్నం 3 గంటల సమయంలో నీరు వదులుతుండడంతో కూలీ పనులకు, కంపెనీలకు వెళ్లే వారికి నీరు పట్టుకొనే అవకాశం ఉండడం లేదు.

సమస్య పరిష్కరిస్తాం

డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నీటి సమస్య దృష్టికి వచ్చింది. కాగా కింది ఫ్లోర్‌లోకి నీరు సరఫరా అవుతుంది. అయితే ట్రాక్టర్ ట్యాంకర్ ఒకటే ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తాం.

– సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, భూత్పూర్

నీళ్లు రాక ఇబ్బంది



డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద నీరు రాకా ఇబ్బందిగా ఉంది. 288 ఇళ్లు నిర్మించి ఇచ్చినా కనీస సౌకర్యాలు కల్పించలేదు. నీటి ట్యాంకులు నిర్మించకపోవడంతో రెండు ఫ్లోర్లకు నీళ్లు తీసుకపోవడానికి చాలా ఇబ్బంది అవుతోంది. రూ. 5లక్షలు నీటి కోసం ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. కానీ ఎందుకు ఖర్చు పెట్టారో తెలియడం లేదు. ఎవరూ సమస్య గురించి పట్టించుకోవడం లేదు.

– మహ్మద్ ఇబ్రహీం, డబుల్ బెడ్‌రూం, సిద్ధాయిపల్లి

పనిమానుకుని ఉంటున్నాం



మధ్యాహ్నం 3 గంటలకు మిషన్ భగీరథ నీరు వస్తుంది. దీంతో కూలీ పనికి వెళ్లకుండా నీరు పట్టుకోవడానికే ఇంటి దగ్గర ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. రెండు బోర్లు ఉన్నా నీళ్లు లేక ఎండిపోయాయి. ఎంపీ ఎన్నికల సమయంలో రోజూ 10 ట్రాక్టర్ ట్యాంక్‌ల నీటిని పంపిస్తామని చెప్పారు. తర్వాత ఎవరూ పట్టించుకోవడం లేదు.

– రజిత, గృహిణి, డబుల్ బెడ్ రూం, సిద్ధాయిపల్లి

ఖాళీ చేసి వెళ్లిపోతాం



నీళ్లు రాకుండా ఉంటే ఎట్లా ఉండాలి. పరిస్థితి ఇట్లానే ఉంటే ఖాళీ చేసి వెళ్లి పోతాం. పిల్లలు బతుకుదెరువు కోసం కూలీ పనులకు వెళ్తారు. మధ్యాహ్నం పూట నీళ్లు వస్తే మోసుకొని వెళ్తున్నాను, శరీరం నొప్పులు అవుతున్నాయి. వీధి లైట్లు పడటం లేదు. రాత్రి వేళల్లో పాములు, తేళ్లు వస్తున్నాయి. భయం అవుతోంది. సమస్యలు పరిష్కరించాలి.

– అమీన్, డబుల్ బెడ్‌రూం, సిద్ధాయిపల్లి

317 జీఓ బాధితులకు న్యాయం చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం గతంలో చేపట్టిన 317 జీఓలో భాగంగా 13 జిల్లాల బాధితులకు వెంటనే న్యాయం చేయాలని కోరుతూ టీపీఆర్‌టీయూ నాయకులు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. గత సెప్టెంబర్‌లో జరిగిన బదిలీల్లో ఇంకా రిలీవ్‌కాని ఉపాధ్యాయులకు రిలీవ్ ఇవ్వాలని, మాడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలన్నారు. ఎన్నికల కోడ్ వల్ల నిలిచి పోయిన జోన్–2 పదోన్నతులను వెంటనే చేపట్టాలన్నారు. 2010 కంటే ముందు నియామకాలు జరిగిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో పండిట్, పీఈటీలకు అప్‌గ్రేడేషన్ చేయాలన్నారు. వ్యవస్థాపక, గౌరవ అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి, అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరహనుమాన్ జాతర



వేడుకలకు సిద్ధమైన హనుమాన్ ఆలయం

మహమ్మదాబాద్: గాధిర్యాల్‌లో గురువారం నుంచి వీరహనుమాన్ జయంతి ఉత్సవాలు మూడు రోజులపాటు జరగనున్నాయని ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం తెలిపారు. శ్రీశ్రీశ్రీ పరిశుద్ధానంద స్వామివారి సౌజన్యంతో గురువారం ఉదయం సుప్రభాతం, మహాగణపతి గౌరీపూజ, స్వస్తిపుణ్యాహావాచనం, ధ్వజారోహణం, సకలదేవతల మండపారాధన, అఖండదీపారాధన, రుద్రాభిషేకం, పార్వతీపరమేశ్వర కల్యాణం చేపట్టనున్నారు. 31న యాగశాల ప్రవేశం, అభిషేకం, హనుమత్, శ్రీరామ, రుద్ర హోమ కార్యక్రమాలు అనంతరం భక్తులకు తీర్థ అన్నదాన ప్రసాదం కార్యక్రమాలు ఉంటాయన్నారు. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా సుప్రభాతం, తెల్లవారుజామున 4.08 గంటలకు రథోత్సవం (తేరు) స్వామివారికి అభిషేకం ప్రత్యేక పూజలు అభిషేకం పూర్ణాహుతి సాయంత్రం పల్లకీసేవ, బొడ్రాయికి బోనాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



బాధితకుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంటలో పార్టీ కార్యకర్త రఫీక్‌ఖాన్ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మరణించాడు. అదేవిధంగా ఉంద్యాలలో మన్నెం నాయక్ ప్రమాద వశాత్తు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో విషయాలను తెలుసుకున్న ఆల బుధవారం రఫీక్ ఖాన్ కుటుంబ సభ్యులను, మన్నెం నాయక్‌ను పరామర్శించారు. ఆర్థిసాయం అందజేశారు.

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన బషీర్‌ఘోరీ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందడంతో బుధవారం బాధిత కుటుంబాన్ని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఘోరీ కుమారుడు, మండల కోఆప్షన్ ఖాజాఘోరీని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు చందూగౌడ్ కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, బొడ్డు రమేష్, మహేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, రవి తదితరులు ఉన్నారు.

సాగుకు తగ్గట్టుగా పత్తి విత్తనాలు సిద్ధం



నవాబుపేటలో రైతులకు జీలుగ విత్తనాలు అందిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్

- జిల్లాలో 80 వేల ఎకరాల్లో సాగుకు అవకాశం
- అందుబాటులో 1.80 లక్షల విత్తనాల ప్యాకెట్లు
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్

నవాబుపేట: జిల్లాలో తాజాగా పత్తి విత్తనాల సాగు భారీగా పెరిగే అవకాశం ఉందని దాదాపుగా 80 వేల ఎకరాలలో పత్తి సాగు చేసే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ అన్నారు. అందుకు అనుగుణంగా అంచనాలు సిద్ధం చేసి.. వ్యవసాయ యంత్రాంగం సిద్ధమైందని వివరించారు. బుధవారం మండలంలోని వివిధ ఎరువుల దుకాణాలకు మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్‌తో కలిసి తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంటలకు తగ్గట్టుగానే 1.80 లక్షల విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కాగా రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనాలని సూచించారు. రైతులకు అన్ని రకాల విత్తనాలు, పంటల దిగుబడికి కావాల్సిన విత్తనాలు సైతం అందుబాటులో ఉంచామని వివరించారు. తాజాగా జిల్లాకు 1,820 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరం ఉండగా నేటికీ 1,100 క్వింటాళ్లు వచ్చాయన్నారు. వీటిలో 927 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలో ఉన్న వివిధ మండలాల్లో ఆగ్రో కేంద్రాల ద్వారా 2,240 మంది రైతులకు అందించామని ఆయన తెలిపారు. జనుము విత్తనాలు 318 క్వింటాళ్లకు మొత్తం వచ్చాయని ఆయన వివరించారు. వీటిలో ఇప్పటికే 240 క్వింటాళ్ల విత్తనాలు విక్రయించామన్నారు.

పత్తి పంటలు జాగ్రత్తగా వేయాలి

పత్తి పంటను జూన్ 15వ తేదీలోగా వేయాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. కాగా వర్షపాతం తేమను పరిశీలించి నాటుకోవాలని అందుకు ముందుగా పొలాలు సిద్ధం చేసుకోవాలన్నారు. కాగా పత్తి రైతులు విత్తనాలు లైసెన్స్ ఉన్న దుకాణంలో కొని నాటుకోవాలన్నారు. నాటిన విత్తనాల ప్యాకెట్‌లను భద్రంగా ఉంచాలన్నారు. లూస్ విత్తనాలను కొనరాదని.. ఎవరైనా అలాంటివి అమ్మితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రైతులకు జీలుగ విత్తనాలు అందించారు.

కార్గో బుకింగ్‌లో ఇబ్బందులు



పార్సిల్స్‌తో నిల్చున్న పట్టణవాసులు

జడ్చర్ల టౌన్: బస్టాండ్‌లోని కార్గోలో పార్సిల్‌లు బుకింగ్ చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పట్టణవాసులు వాపోతున్నారు. బుధవారం ఉదయం 9.30గంటల నుంచి గంటపాటు నిల్చున్నా సిబ్బంది పార్సిల్ బుకింగ్ చేసుకోలేదని చింతకాయల నాగరాజు అనే వ్యక్తి తెలియజేశారు. తనతోపాటు ఎంతోమంది పార్సిల్స్ తీసుకువచ్చి వెనక్కి వెళ్లిపోయారన్నారు. ఇదే కాకుండా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని ఇటీవల ఫిర్యాదులు పెరిగాయి. బుకింగ్ చేసుకోలేమని నిర్లక్ష్యంగా బదులిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పార్సిల్‌లకు సైతం త్వరగా డెలివరీ ఇవ్వటం లేదని చెబుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోయిల్‌కొండ: మండలంలోని కొత్లాబాద్ ఉన్నత పాఠశాలలో (2004–2005 పదోతరగతి) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అప్పటి గురువులు రిటైర్డ్ జీహెచ్‌ఎం కృష్ణయ్య, లక్ష్మణ్, సురేఖ, భీమయ్య తదితరులు పాల్గొన్నారు. వారిని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడు మృతి

భూత్పూర్: మండలంలోని కొత్త మొల్గరకి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాంచంద్రయ్య గౌడ్ (50) బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన తెలంగాణ ఉద్యమ సమయంలో పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. కాగా రాంచంద్రయ్య మరణ వార్త తెలుసుకున్న భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, వెంకటేష్, మాసగౌడ్‌లతో వివిధ పార్టీలకు చెందిన పలువులు నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

గండీడ్: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని మండల స్పెషల్ ఆఫీసర్ డీడీ పాండు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడం మూలంగా ఎప్పటికపుడు పారిశుద్ధ్యం పనులు చేయించాలన్నారు. వచ్చే నెలలో వర్షాలు పడగానే హరితహారంలో భాగంగా మొక్కలు నాటాల్సి ఉంటుందని అప్పటి వరకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉపాధి పనుల్లో లేబర్ సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు మొక్తదీర్ బాబా పక్షవాతానికి గురవడంతో బాధితుడికి.. గతంలో మూసాపేట తహసీల్దార్ కార్యాలయంలో గిర్ధావర్‌గా పనిచేసి వెళ్లిన ఎండీ హైమద్ ఆర్థిక సాయం చేశారు. వైద్య ఖర్చుల కోసం రూ.5వేలను పంపడంతో వాటిని మజీద్ కమిటీ సభ్యుల సమక్షంలో మాజీ ఉప సర్పంచ్ టైలర్ కలీం బుధవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో ఖాజామైనోద్దీన్, ముక్తార్ అహ్మద్, తిరుపతయ్యగౌడ్, తాజోద్దీన్, సలాం, ఖాదర్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పనులు



రాజాపూర్: ఇటీవల గాలివానతో మండలంలోని తిరుమలాపూర్, దొండ్లపల్లి గ్రామాలల్లో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో పాటు స్తంభాలు విరిగి పోవడంతో సరఫరాకు అంతరాయం కలిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో బుధవారం స్థానికంగా ఏడీ తౌర్యానాయక్ ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు కొనసాగించారు. విరిగిన వాటి స్థానంలో కొత్త పోల్స్ ఏర్పాటు చేసే పనులు చేపట్టారు.

విద్యను వ్యాపారంగా మార్చుతున్నారు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విద్యావ్యవస్థను ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు వ్యాపారంగా మార్చుతున్నాయని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ (సీఆర్ఓ) జిల్లా అధ్యక్షుడు బూనీడు బాలరాజు ఆరోపించారు. ప్రైవేట్ స్కూల్ ఫీజులను నియంత్రించాలంటూ బుధవారం కలెక్టరేట్‌లో డీఈఓ రవీందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఏటా ఫీజులు పెంచుతున్నాయని అందులో పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతున్న పాఠశాలలోనే పుస్తకాలను విక్రయిస్తున్నారని, వారు నిర్ణయించిన రుసుము చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. అలాగే యూనిఫాంను సైతం తమ వద్దే కొనాలని ఇబ్బందులు పెడుతున్నారని, ఈ సమస్యలను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పూడికతీత పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కొత్తచెరువు రోడ్ ప్రాంతంలోని అమ్మగూడ కాలనీలో కొన్ని రోజులుగా మిషన్‌భగీరథ పథకం పైపులైన్ లీకేజీ అవుతోంది. దీనిని గుర్తించిన మున్సిపల్ అధికారులు సరిచేసేందుకు పనులు ఆరంభించారు. అలాగే సమీపంలోని డ్రెయిన్‌లో పూడికతీత చేపట్టారు. వీటిని బుధవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం న్యూటౌన్ నుంచి పెద్దచెరువు వైపు వెళ్లే మురుగు, వరద కాల్వల్లో పేరుకుపోయిన మట్టిని తొలగింపజేశారు. కార్యక్రమంలో ఎంఈ యు.బస్వరాజ్, ఏఈ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేయాలి



అమ్మపూర్ పాఠశాలను పరిశీలిస్తున్న జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రావు

నవాబుపేట: యుద్ధ ప్రాతిపదికన పాఠశాలలో కొనసాగుతున్న అబివృద్ధి పనులు పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావు సూచించారు. బుధవారం నవాబుపేట, జంగమయ్యపల్లి, లింగంపల్లి, అమ్మపూర్, ధరిపల్లి తదితర పాఠశాలల్లో పనులు పరిశీలించారు. చాలాచోట్ల పూర్తికావచ్చాయని.. మిగతా చోట్ల సైతం వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అందుబాటులో ఉంచాలన్నారు. మండల అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. లింగంపల్లిలో పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖలపై ఆరాతీశారు. విద్యార్థుల దుస్తులు కుట్టె కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, జీహెచ్‌ఎం నాగ్యానాయక్ తదితరులు ఉన్నారు.

బాలానగర్: మండల ప్రత్యేక అధికారి బాబురావ్ బుధవారం వీరన్నపల్లి, వీరన్నపల్లి తండా, ఉడిత్యాల గ్రామాల్లో జరుగుతున్న పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఉడిత్యాలలో విద్యార్థుల కోసం కుడుతున్న దుస్తులను పరిశీలించారు. ఎంపీడీఓ శరత్ చంద్ర బాబు తదితరులు ఉన్నారు.

గండీడ్: మండల స్పెషల్ ఆఫీసర్, డీడీ పాండు, ఎంపీడీఓ దేవన్న, ఎంఈఓ వెంకటయ్య తదితరులు ఆయా గ్రామాల్లో పాఠశాలల్లో చేపడుతున్న పనులను బుధవారం పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేసి అందుబాటులో ఉంచాలని సూచించారు.

జడ్చర్ల టౌన్: ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, సూపరింటెండెంట్ వెంకట్‌ప్రసాద్ బూర్గుపల్లి, పెద్దతండా, కిష్టంపల్లి, ఆలూరు గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారు. అదేవిధంగా ఈజీఎస్ పనులు పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలను పరిశీలించి వర్షాకాలం ప్రారంభం కానున్నందున అందుబాటులో ఉంచాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు రాఘవేందర్, శశిధర్, హబీబ్, తులసిలు ఆయన వెంట ఉన్నారు.

లింగంపేట, కోడ్గల్, కొండేడ్, కుర్వపల్లి గ్రామాల్లో పాఠశాలల పనులను ఎంపీఓ జగదీశ్ తనిఖీ చేశారు. లింగంపేట పాఠశాలలో నిర్మాణం జరుగుతున్న స్లంప్‌ను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కుర్వపల్లిలో పల్లెప్రకృతి వనం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, నిసార్ పాల్గొన్నారు.



గండేడ్ పరిధిలో..



లింగంపేటలో..



వీరన్నపల్లి తండాలో..

బూరెడ్డిపల్లి శివారులో చెరువు పరిశీలన



జడ్చర్ల: బూరెడ్డిపల్లి శివారులోని గోధుమ కుంటను బుధవారం నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. గోధుమకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో సంబంధిత పట్టాదారు గుంతలు తీసి మొక్కలు నాటుతుండడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ డీఈఈ కృష్ణ, ఏఈ మహేశ్‌లు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని విచారించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో గల భూమి పట్టాగా ఉండడంతో రైతు ఇష్టానికి వదలేశామని తెలిపారు. మొక్కలు నాటుకోవడం, పంటలు వేసుకోవడం రైతు ఇష్టమన్నారు. కానీ వెంచర్లు తదితర శాశ్వత నిర్మాణాలు చేపడితే చర్యలు చేపడుతామన్నారు. చెరువులు, కుంటలపరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.